సాక్షి
సిద్దిపేట
శనివారం । 23 । డిసెంబర్ । 2023


వర్గల్ శ్రీవెంకటేశ్వరాలయం


ఆలయంలో కొలువైన శ్రీవెంకటేశ్వరుడు

న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్లు

కొండపాక(గజ్వేల్): సైబర్ నేరాలపై మహిళా సమాఖ్యలు అప్రమత్తంగా ఉండాలని సీఎఫ్ ఎల్ కౌన్సిలర్లు స్వామి, సాయికృష్ణ అన్నారు. కొండపాకలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య సంఘాల లీడర్లకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు సంపూర్ణ అక్షరాస్యత కలిగి ఉండటం వల్ల కొంతవరకు సైబర్ నేరాలకు గురికాకుండా ఉంటారన్నారు. గ్రామాల్లో మహిళలు బ్యాంకుల నుంచి ఏ రకమైన రుణ సహాయం పొందడానికైనా అకౌంట్ల ద్వారానే ప్రభుత్వం చెల్లింపులు చేస్తుందన్నారు.

పత్తి కొనుగోళ్లు బంద్

హుస్నాబాద్: సీసీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పత్తి కొనుగోళ్లను ఈనెల 24, 25, 26 తేదీల్లో నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి సుజన్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మళ్లీ 27వ తేదీన పునః ప్రారంభమవుతాయని, రైతులు గమనించాలని పేర్కొన్నారు.

బీసీ హాస్టల్ నూతన భవనం నిర్మించాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్ కుమార్


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్‌కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శిథిలావస్థలో ఉన్న జిల్లా కేంద్రంలోని సమీకృత బీసీ హాస్టల్ స్థానంలో అన్ని హంగులతోకూడిన నూతన భవనం నిర్మించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ సిద్దిపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో హాస్టల్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పాతభవనం స్థానంలో నూతన భవనం నిర్మించాలన్నారు. చలికి విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని, ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ ఉపాధ్యక్షుడు అభిరాం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శశిధర్


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సీపీఎం నాయకులు

సిద్దిపేట కమాన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శశిధర్ పిలుపు ఇచ్చారు. లోకసభ, రాజ్యసభ పార్లమెంట్ సభ్యులను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో శుక్రవారం నిరసన తెలిపారు. 146 మంది ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, అరుణ్, సంజీవ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటికి ముస్తాబు

- శుభకరం.. ఉత్తర ద్వార దర్శనం
- నాచగిరి, వర్గల్ క్షేత్రాల్లో ఏర్పాట్లు

వర్గల్(గజ్వేల్): జిల్లాలో సుప్రసిద్ధమైన నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రం, వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రంలోని వెంకటేశ్వరాలయం, శ్రీవేణుగోపాలుని కోవెలలు 'ముక్కోటి' ఏకాదశి వేడుకలకు ముస్తాబయ్యాయి. శనివారం తెల్లవారుజామున 5.30 గంటలకు నాచగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారు, వర్గల్ శ్రీవెంకటేశ్వరస్వామివారు, వేణుగోపాలస్వామి వారు భక్తులకు వైకుంఠ ఉత్తర ద్వారం గుండా దర్శనమిస్తారు. ఈ విశేష పర్వదిన వేళ స్వామివారలను దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు నాచగిరి, వర్గల్ క్షేత్రాలకు తరలిరానున్నారు. ముక్కోటి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని నాచగిరి ఈఓ అన్నపూర్ణ పేర్కొన్నారు.

ఉత్తర ద్వారంలో ..

ముక్కోటి దేవతలు సేవించే వైకుంఠ ఏకాదశి విశేష పర్వదినం రోజు ప్రాతఃకాలం ఉత్తర ద్వారంలో వేంచేసిన శ్రీస్వామి వారిని దర్శించుకుంటే పాపాలు తొలగిపోతాయి. సకల శుభాలు సిద్ధిస్తాయని శాస్త్రాలు, పురాణాలు చెబుతున్నాయి. స్వామి వారితో పాటు ముక్కోటి దేవతలను దర్శించుకున్న పుణ్యం దక్కుతుంది. వైకుంఠ ప్రాప్తి లభిస్తుంది. ఈ పర్వదినం సందర్భంగా వర్గల్ వెంకటేశ్వరాలయంలో శనివారం తెల్లవారుజాము 3 గంటలకు అభిషేకం, 5.30 గంటల వరకు అలంకార సేవ, 5.45 గంటల వరకు ఉత్తర ద్వార పూజ, 6 గంటల నుంచి ఉత్తర ద్వారం గుండా భక్తులకు స్వామివారి దర్శనం ఉంటుంది. ఉదయం 10 గంటల నుంచి తులసి అర్చన, పంచసూక్త పారాయణాలు జరుగుతాయి.

– చంద్రశేఖర సిద్ధాంతి
వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రం

విద్యుత్ బకాయిలు రూ.1,983 కోట్లు

ఇరిగేషన్ రూ.1,018 కోట్లు

- ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు రూ.919 కోట్లు
- సిద్దిపేట మున్సిపాలిటీ రూ.19.72 కోట్లు
- డొమెస్టిక్ రూ.7.02 కోట్లు, కమర్షియల్ రూ.5.38 కోట్లు



సాక్షి, సిద్దిపేట: జిల్లాలో విద్యుత్తు శాఖకు ప్రభుత్వ శాఖల బకాయిలు గుట్టలా పేరుకుపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.1,983.36 కోట్ల బకాయిలున్నాయి. అందులో రూ.1,954 కోట్లకు పైగా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన బకాయిలే ఉన్నాయి. డొమెస్టిక్ రూ.7.02 కోట్లు, కమర్షియల్ రూ.5.38 కోట్లు చెల్లించాల్సి ఉంది. సిద్దిపేట, గజ్వేల్‌లో మొదటి, రెండు స్థానాల్లో విద్యుత్ బకాయిలున్నాయని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బకాయిలపై జోరుగా చర్చించుకుంటున్నారు.

మొత్తం 13 సర్వీసులపై..

జిల్లా వ్యాప్తంగా 5,64,883 విద్యుత్తు కనెక్షన్‌లున్నాయి. అందులో గృహ ఉపయోగాలకు 3,41,833 కనెక్షన్‌లు, కమర్షియల్ 42,949, పరిశ్రమలకు 4,044, వ్యవసాయ కనెక్షన్‌లు 1,65,211, ఇతర కనెక్షన్‌లు 10,846 ఉన్నాయి. జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న సాగర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మ, గౌరవెల్లి రిజర్వాయర్లలో మొత్తంగా 13 సర్వీస్‌లపై రూ. 1,018.79 కోట్ల బకాయిలున్నాయి. కొంత కాలంగా విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదు.

అన్ని శాఖల నుంచి..

జిల్లాలోని ప్రభుత్వ రంగసంస్థలు రూ.919.26 కోట్ల విద్యుత్తు బకాయిలున్నాయి. చిన్నకోడూరు మండలం మల్లారంలోని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ వర్క్స్ (హెచ్‌ఎండబ్ల్యూడబ్ల్యూ) రూ.409.82 కోట్లు, కొండపాకలో రవీంద్రనగర్ శివారులోని హెచ్‌ఎండబ్ల్యూడబ్ల్యూ రూ.364.94 కోట్లు, సిద్దిపేట మున్సిపాలిటీ 4 సర్వీస్‌లలో మొత్తంగా రూ. 19.72 కోట్లు, మిషన్ భగీరథలో ఐదు సర్వీస్‌లు రూ.117.14 కోట్లు, జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయం రూ.22.70 లక్షలు, ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలు, దేవాలయాలు, మిగతా సంస్థలు రూ.7.42 కోట్ల బకాయిలున్నాయి.

జిల్లాలో జోరుగా చర్చ

సిద్దిపేట, గజ్వేల్‌లో విద్యుత్ బకాయిలు ఎక్కువగా ఉన్నాయని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంలో జిల్లా వ్యాప్తంగా జోరుగా చర్చ సాగుతోంది. ప్రభుత్వరంగ సంస్థలే అధికంగా బకాయిలున్నాయని, గృహ వినియోగించేవారు నెల బకాయి ఉంటే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తారని విద్యుత్ వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రీపెయిడ్ విద్యుత్ సరఫరా చేయాలని నిబంధన ఉంది. అయితే పలు కార్యాలయాల్లో ప్రీ పెయిడ్ మీటర్లు ఏర్పాటు చేయకపోవడంతోనే రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోయాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

నోటీసులు జారీ చేశాం

విద్యుత్ బకాయిలున్న ప్రభుత్వ రంగ సంస్థలకు ప్రతీనెల నోటీసులు జారీ చేశాం. మా ఉన్నత అధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లాం. ప్రతీనెల బకాయిల వివరాలు అందజేశాం. ప్రైవేట్ సంస్థలు విద్యుత్ బిల్లు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తాం.

– జి.మహేష్‌కుమార్, ఎస్ఈ



సీఎస్ఐ చర్చి జిగేల్

క్రిస్మస్‌ను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించడంతో రాత్రివేళ వెలుగులో జిగేల్‌మంటున్నాయి. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చి విద్యుత్ దీపాల వెలుగులతో కనువిందు చేసింది. -ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

క్రీస్తు మార్గంలో నడవాలి


క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: ఏసుక్రీస్తు దీవెనలతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో జీవనం సాగించాలని, ఆయన చూపిన శాంతి మార్గంలో నడవాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం రాత్రి కొండ భూదేవి గార్డెన్‌లో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. క్రిస్మస్ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏటా క్రిస్మస్‌ను రాష్ట్ర పండవగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొత్త బట్టలు ధరించి ఆనందంగా పండగలు చేసుకోవాలని ముస్లిం, హిందువులు, క్రైస్తవులకు బట్టలు పంపిణీ చేసినట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలో చర్చిల నిర్మాణం కోసం ప్రభుత్వ అనుమతులతో పాటు వ్యక్తిగత సాయం చేసినట్లు తెలిపారు. సిద్దిపేటలో క్రైస్తవ భవన్ నిర్మాణం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం క్రిస్మస్ కానుకగా కొత్త బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ రమేశ్ బాబు, తహసీల్దార్ దిలీప్ నాయక్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, కౌన్సిలర్లు మల్లికార్జున్, సాయి ఈశ్వర్ , శ్రీహరి, ఆనంద్, నాయకులు సంపత్, భీమసేన, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానంతోనే గుర్తింపు

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి


రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

రాయపోల్(దౌల్తాబాద్): విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలిచినపుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా కృషి చేయాలన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన గణిత, సైన్స్, ఇంగ్లిష్ ల్యాబ్‌ను ప్రారంభించారు. విద్యార్థుల గణిత ప్రదర్శనలు, రంగవల్లులను తిలకించి వారిని అభినందించారు. సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి బహుమతులు అందజేశారు. కాగా భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి 10వ తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన భౌతిక, రసాయనశాస్త్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సమ్మ, హెచ్‌ఎం అంజిరెడ్డి, ఎంఎన్‌ఓ సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ ప్రవీణ్, ఎస్‌ఎంసీ చైర్మన్ స్వామిగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): శ్రీనివాస రామానుజన్ దేశానికి ఆదర్శ ప్రాయుడని, నేటి తరానికి గొప్ప మార్గదర్శకుడని డీఈఓ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్స్‌లో శుక్రవారం గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు రామానుజన్ స్ఫూర్తితో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరాలన్నారు.

కొండపోచమ్మకు రూ.49 లక్షల ఆదాయం

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ జాతరలో విక్రయాలకు వేలం పాట నిర్వహించగా రూ.49.44 లక్షల ఆదాయం సమకూరిందని ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జగదేవ్‌పూర్ కొండపోచమ్మ ఆలయ కార్యాలయంలో వేలం పాట నిర్వహించగా కొబ్బరి కాయల విక్రయాలకు తిగుల్ నర్సాపూర్‌కు చెందిన శ్రీవాణి రూ.12.14 లక్షలకు దక్కించుకున్నారు. అదే గ్రామానికి చెందిన గాడిచర్ల నాగరాజు లడ్డూ, పులిహోర విక్రయాలకు రూ.25.40 లక్షలు, ఒడి బియ్యం సేకరణకు ఉప్పరిపల్లి లక్ష్మీ రూ.8.90 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే ఐదు దుకాణ సముదాయాలకు రూ.3 లక్షలకు తిగుల్ నర్సాపూర్ యువకులు దక్కించుకున్నట్లు ఈఓ తెలిపారు. కొబ్బరి ముక్కలకు సంబంధించి అంచనా మొత్తం రాకపోవడంతో వేలం వాయిదా వేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ వేలం పాట ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ సూపరింటెండెంట్ శివరాజ్, సర్పంచ్ రజిత రమేష్, ఎంపీటీసీ కావ్యదర్గయ్య, ఉపసర్పంచ్ సురేందర్‌రెడ్డి, సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య, సుధాకర్, చందు, లక్ష్మణ్, హరి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

లీడ్‌బ్యాంకు మేనేజర్ సత్యజిత్


శిక్షణా కేంద్రంలో లీడ్‌బ్యాంకు మేనేజర్ సత్యజిత్

తొగుట(దుబ్బాక): మహిళలు ఆర్థికంగా ఎదిగినపుడే స్వయం సమృద్ధిని సాధిస్తారని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యజిత్ అన్నారు. మండలంలోని ఘనపురంలో నాబార్డు సహకారంతో ఐఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మగ్గం వర్క్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మగ్గం వర్క్ శిక్షణ పొందిన గ్రామీణ మహిళలకు జీవనోపాధి లభిస్తుందన్నారు. శిక్షణ తర్వాత సొంతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకునేవారికి బ్యాంకుల ద్వారా రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మగ్గం వర్క్ శిక్షణను సద్వినియోగంచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రాజలింగం, ట్రైనర్ రజిత పాల్గొన్నారు.

ఇన్సెంటివ్ బకాయి చెల్లించాలి

పట్టు రైతుల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు ఐలయ్య


వినతి పత్రం అందజేస్తున్న సంఘం జిల్లా అధ్యక్షుడు ఐలయ్య

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టు రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇన్సెంటివ్ ఇస్తోందని, 2018 నుంచి ఇవ్వకపోడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారని పట్టు రైతుల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దోళ్ల ఐలయ్య, ప్రధాన కార్యదర్శి వెంకటరాంరెడ్డి అన్నారు. ఇన్సెంటివ్ బకాయి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం జనగామ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి లతకు వినతిపత్రం అందజేశారు. బకాయి నగదు 15 రోజుల క్రితం జనగామ, తిరుమలగిరి మార్కెట్ అధికారుల ఖాతాలో జమ చేశారని కానీ, ఇంతవరకు రైతులకు ఇవ్వలేదని ఆరోపించారు. ఇన్సెంటివ్ చెల్లిస్తే రైతులకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందన్నారు. మార్కెట్‌కు పట్టుగూళ్లు తీసుకెళ్లిన రోజే డబ్బులు చెల్లించాల్సి ఉన్నా మార్కెట్ ఆఫీసర్లు డీలర్లతో కుమ్మక్కయి రైతులను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బకాయి చెల్లించేలా చర్యలు తీసుకోవడంతో పాటు మార్కెట్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారని తెలిపారు.

గౌరవెల్లి ప్రాజెక్టుపై నిఘా కరువు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామం వద్ద నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టుపై నిఘా కొరవడింది. కుందనవానిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సెప్టెంబర్ 24వ తేదీన ఎన్జీటీ ఆదేశాల మేరకు గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్‌ఎంబీ) సభ్యులు కట్టపై జరిగే ప్రతీకదలిక నేరుగా హైదరాబాద్‌లోని జీఆర్‌ఎంబీ కార్యాలయంలో నమోదయ్యేలా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో కట్టపై సీసీ కెమెరా ధ్వంసం కలకలం రేపుతోంది. ప్రాజెక్టు కట్టపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడంతో దుండగులు ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది. సీసీ కెమెరాను ఎవరు ధ్వంసం చేశారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రాత్రి వేళ కట్టపై మందుబాబులు తాగిన మైకంలో చేశారా? లేక ఆకతాయిల పనా? అనేది తేలాల్సి ఉంది.

ఎన్జీటీ ఆదేశాల మేరకు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.41 టీఎంసీల నుంచి 8.23 టీఎంసీలకు పెంచింది. అయితే పెంచిన సామర్థ్యానికి పర్యావరణ అనుమతులు లేవని, పాత అనుమతులుతోనే పనులు చేస్తున్నారని ముంపు గ్రామమైన గుడాటిపల్లికి చెందిన పలువురు భూ నిర్వాసితులు జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ)ని ఆశ్రయించారు. దీంతో ప్రాజెక్టు కట్టపై ఏడు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.


గౌరవెల్లి ప్రాజెక్టు కట్టపై ధ్వంసమైన సీసీ కెమెరా (వృత్తంలో)

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు 48 మంది ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

చేగుంట(తూప్రాన్): రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు 48 మంది ఎంపికైనట్లు కోచ్ గణేశ్ రవికుమార్ తెలిపారు. మండల కేంద్రమైన చేగుంట మోడల్ స్కూల్‌లో శుక్రవారం జిల్లా స్థాయి ఖేలో ఇండియా బాలికల రగ్బీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్ 14, అండర్ 18 విభాగాల్లో 48 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు కోచ్ తెలిపారు. వీరంతా శనివారం నుంచి సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లాస్థాయి పోటీలను నేషనల్ రగ్బీ రెఫరీ కరణం మల్లీశ్వరీ, పీఈటీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, పీడీలు శారద, మంజుల, నర్సింలు, పీఈటీ బాలరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి ఎంపికైన విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలోని జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీఈటీ గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 25 తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లా తొర్రూరులో రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ జరుగనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా తరఫున అండర్-14 బాలుర విభాగంలో ఆర్అండ్ఆర్ కాలనీలోని జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన గణేష్, శ్రీనివాస్, శివతోపాటు అండర్-17 బాలుర విభాగంలో వంశీ, ప్రణయ్ పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభను చాటి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరీమొద్దీన్, ఉపాధ్యాయులు ఆకాంక్షిస్తూ క్రీడాకారులను అభినందించారు.

లోన్‌పేరిట రూ.57 వేలు హాంఫట్

సిద్దిపేటఅర్బన్: లోన్ పేరిట సైబర్ నేరగాడు చెప్పిన మాయమాటలు నమ్మిన వ్యక్తి డబ్బులు పంపి మోసపోయాడు. ఈ ఘటన శుక్రవారం సిద్దిపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సైబర్ నేరగాడు ఇండియా బుల్స్ ఫైనాన్స్ సంస్థ లోన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పేరిట ఫోన్ చేశాడు. బాధితుడికి లోన్ మంజూరు అయిందని ప్రాసెసింగ్ ఫీజు ముందుగా చెల్లిస్తే రుణం డబ్బులు అకౌంట్‌లో జమ అవుతాయని నమ్మించాడు. అది నమ్మిన బాధితుడు రూ.57,094 పంపించాడు. ఆ తర్వాత రుణం డబ్బుల కోసం ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. అనుమానం వచ్చిన బాధితుడు వెంటనే సైబర్ సెల్ జాతీయ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. స్పందించిన అధికారులు డబ్బులను ఫ్రీజ్ చేశారు. సమాచారాన్ని సిద్దిపేట త్రీటౌన్ పోలీసులకు అందించారు.

ఇల వైకుంఠం..

- ముక్కోటి ఏకాదశికి ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి
- విద్యుత్ వెలుగుల్లో సర్వాంగ సుందరంగా
- భారీగా తరలిరానున్న భక్తులు
- మెరుగైన సౌకర్యాలు, భద్రత కల్పన

ముక్కోటి ఏకాదశి పూజలకు వైష్ణవ దేవాలయాలు ముస్తాబయ్యాయి. శనివారం ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తనున్నారు. ఇందుకు సంబంధించి ఆలయాల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మోహినిపుర శ్రీ వేంకటేశ్వర ఆలయం, పాత వేంకటేశ్వర ఆలయం, నాచారం శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలతోపాటుగా అన్ని వైష్ణవాలయాలను విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

-ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)



విద్యుత్ అలంకరణలో మోహినిపుర వేంకటేశ్వర ఆలయం



సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మోహినిపుర శ్రీ వేంకటేశ్వర ఆలయంలోని వేంకటేశ్వర స్వామి వారిని వైకుంఠ ఏకాదశికి దర్శించుకోవడం కోసం జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుండడంతో అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ప్రతీ సంవత్సరం ముక్కోటి ఏకాదశి రోజు లక్ష మంది భక్తులు శ్రీవేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటారు. ఉత్తర ద్వారం నుంచి స్వామి వారిని దర్శించుకుంటే అనేక పాపాల నుంచి విముక్తి కలుగుతుందని, కుటుంబంలో అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని భద్రత, మౌలిక సౌకర్యాలు, వాహనాల కోసం పార్కింగ్ తదితర ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, సీఎస్ఐ చర్చి ఆవరణ, ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లలో పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఎక్కడా ఇబ్బంది లేకుండా..

శనివారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు స్వామి వారిని భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో భక్తులకు సేవలు అందించనున్నారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో అత్యవసర వైద్యం నిమిత్తం వైద్య శిబిరం నిర్వహించనున్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్యం, తాగు నీరు, మొబైల్ టాయిలెట్స్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం ఆలయ పరిశుభ్రత తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శాంతి భద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, క్యూలైన్‌లో భక్తులు దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. వికాశ తరంగిణి సభ్యులు స్వామి వారి పల్లకి సేవలో పాల్గొననున్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిరంతరం విద్యుత్ అందించేందుకు ఏర్పాట్లు చేశారు.



ఉత్తర ద్వారం వద్ద భక్తుల కోసం ఏర్పాట్లు

ఉత్తర ద్వారానికి ప్రవేశ ద్వారాలు..

స్వామి వారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకోవడం కోసం ఐదు ప్రవేశ ద్వారాలను ఆలయ ఈవో, నిర్వాహకులు కేటాయించారు. ఐదు ప్రవేశ ద్వారాలు ఐదు కేటగిరీలుగా విభజించారు. గాంధీ చౌరస్తా నుంచి మూడు క్యూలైన్‌లు, ఇందులో ఒకటి ఉచిత దర్శన క్యూ లైన్, రెండోది రూ.100 టికెట్ క్యూ లైన్, మూడోది డోనర్స్ కోసం కేటాయించారు. అదే విధంగా ఆలయం వెనుక వైపు నుంచి రెండు క్యూ లైన్‌లు ఏర్పాటు చేశారు. ఇందులో ఒకటి వీఐపీల కోసం, రెండోది స్థానిక వార్డు ప్రజలకు కేటాయించారు.

జాతీయస్థాయి ప్రోమెథిన్ ఫెస్ట్

- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- 100 పైగా టెక్నికల్ ఈవెంట్ల ప్రదర్శన



కార్యక్రమంలో ప్రహ్లాద్ రావు, తదితరులు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ బీవీఆర్ఐటీ కళాశాలలో జాతీయస్థాయి ప్రోమెథిన్ 2023 ఫెస్ట్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. రెండు రోజులపాటు కొనసాగుతుందని కళాశాల సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో టాటా ప్రెసిడెంట్ (టెక్నాలజీ) ప్రహ్లాద్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు టెక్నాలజీపై అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థికి అగ్రిటెక్, జనరేటివ్ ఏఐపై అవగాహన కల్పించేందుకే జాతీయ స్థాయిలో ప్రోమెథిన్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి దేశంలోని ఆయా రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొని 100 పైగా టెక్నికల్ ఈవెంట్లతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ప్రతిభను చాటుకున్నారన్నారు. ఎస్‌వీఎస్ సెక్రటరీ ఆదిత్య, బీవీఆర్ఐటీ కళాశాల డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్ దూబేలు విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో డాక్టర్.పూర్ణచంద్ర, డాక్టర్ భీమా, డాక్టర్ ఉదయ్ కిరణ్, అశోక్ రెడ్డి, బాపిరాజు, కాంతారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక సాంద్రతతో లాభాలు



పత్తి, వరి విధానాలపై కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

- డాక్టర్ నల్కర్
- పత్తి, వరి విధానాలపై కరపత్రాలు విడుదల

మర్కూక్(గజ్వేల్): అధిక సాంద్రత పద్ధతితో పంట సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ నల్కర్ అన్నారు. శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం మెదక్ ఆధ్వర్యంలో మర్కూక్ మండల కేంద్రంలోని రైతు వేదికలో కిసాన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో భారీ విస్తీర్ణంలో పత్తి పంట సాగవుతున్నప్పటికీ ఉత్పాదక శక్తి తక్కువగా ఉందన్నారు. దీన్ని పెంచడానికి సీఎస్ఐఆర్ నాగ్‌పూర్ వారి ఆధ్వర్యంలో అధిక సాంద్రత పద్ధతి ప్రాజెక్టును చేపట్టి జిల్లాలో 700 ఎకరాలకు పైగా పత్తిని సాగు చేసినట్లు తెలిపారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కూలీల కొరత అధిగమించాలంటే విత్తనం విత్తినప్పటి నుంచి పత్తి తీతవరకు యాంత్రీకీకరణ కావాల్సిన అవసరం ఉందన్నారు. ఏరువాక శాస్త్రవేత్త పల్లవి మాట్లాడుతూ.. వరి వెదజల్లే పద్ధతితో అనేక లాభాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ అనిల్‌కుమార్, ఏఓ నాగేందర్‌రెడ్డి, వసంతరావు, కేవీకే శాస్త్రవేత్తలు రవి, ప్రతాప్‌రెడ్డి, ఏఈఓలు విష్ణు, రైతులు పాల్గొన్నారు.

బీజేపీది నియంతృత్వ పాలన

డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి

సంగారెడ్డి: పార్లమెంట్ భవనంలోకి చొరబడిన వారిని శిక్షించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, అలాగే కాంగ్రెస్ ఎంపీలను సస్పెన్షన్ చేయడం బీజేపీ నియంత పాలనకు నిదర్శనమని డీసీసీ అధ్యక్షురాలు తూర్పు నిర్మలారెడ్డి, పీసీసీ మాజీ కార్యదర్శి తోపాజీ అనంతకిషన్ విమర్శించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపీలను పార్లమెంట్ సమావేశాల నుంచి కేంద్ర ప్రభుత్వం సస్పెండ్ చేయడం సరికాదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ దేశంలో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పనితీరుకు నిరసనగా పార్టీ శ్రేణులు, వామ పక్ష పార్టీల నాయకులు దీక్షలో పాల్గొన్నారు.

గేదెను తప్పించబోయి..

- చెట్టును ఢీకొట్టిన బైక్
- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

నర్సాపూర్ రూరల్: పాడి గేదెను తప్పించబోయే క్రమంలో బైక్ చెట్టును ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం నర్సాపూర్ - వెల్దుర్తి రహదారిలోని లింగాపూర్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన ఉప్పరి నాగరాజు (32) అదే గ్రామానికి చెందిన స్నేహితుడు గుర్రాల ప్రశాంత్‌తో కలిసి బైక్‌పై నర్సాపూర్ వస్తున్నాడు. లింగాపూర్ సమీపంలో ఎదురుగా వస్తున్న పాడి గేదెను తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నాగరాజు అక్కడికక్కడే మృతి చెందగా, ప్రశాంతకు తీవ్రగాయాలు అయ్యాయి. అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడు నాగరాజుకు భార్య సునంద, కుమారుడు నిఖిల్, కూతురు భార్గవి ఉన్నారు.



నాగరాజు (ఫైల్)

ఆనందం.. అంతలోనే విషాదం

- సూర్యోదయాన్ని చూసి వస్తుండగా.. కారు అదుపుతప్పి పల్టీ
- జోగిపేట పాలిటెక్నిక్ విద్యార్థి దుర్మరణం
- మరో నలుగురికి స్వల్ప గాయాలు



కారు కింద పడి మృతి చెందిన బానోతు శ్రీరామ్

గచ్చిబౌలి: అప్పటి వరకు ఆనందంగా గడిపిన ఆ స్నేహితుల జీవితాల్లో ఒక్కసారిగా విషాదం నెలకొంది. అందరూ కలిసి సూర్యోదయాన్ని (సన్‌రైజ్) చూడటానికి వెళ్లి సంతోషంతో తిరిగి వస్తుండగా.. కారు ప్రమాదం తీరని దుఃఖాన్ని మిగిల్చింది. కారు అదుపుతప్పి పల్టీ కొట్టడంతో విద్యార్థి మృతి చెందగా, మరో నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కుసుమంచి మండలం ఎర్రగడ్డ తండాకు చెందిన బానోతు రామ్మోహన్, వినోద దంపతుల కుమారుడు బానోతు శ్రీరామ్(20) జోగిపేటలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఇండస్ట్రియల్ విజిట్ కోసం తోటి విద్యార్థులతో కలిసి నగరానికి వచ్చారు. గురువారం రాత్రి మణికొండలో ఉండే క్లాస్‌మేట్ దితేష్ ఇంట్లో ఉన్నారు. శుక్రవారం ఉదయం సన్‌రైజ్ (సూర్యోదయం) చూసేందుకు ఖాజాగూడ పెద్ద చెరువు వ్యూ పాయింట్ వద్దకు వెళ్లారు. కొద్దిసేపు ఫొటోలు దిగుతూ ఆనందంగా గడిపారు.

అనంతరం పెద్ద చెరువు నుంచి లింక్ రోడ్డు గుండా కారులో ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ వైపు వస్తున్నారు. మలుపు వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా చెట్టును, తర్వాత బండరాయిని ఢీకొట్టి అవతలి రోడ్డులో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముందు సీటులో ఉన్న బానోతు శ్రీరామ్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవ్ చేస్తున్న చందానగర్‌లోని గంగారం నివాసి కె.ఉదయ్ సాయి(18), మణికొండకు చెందిన దితేష్(17), రామాయంపేటకు చెందిన వర్షిత్(18), నారాయణఖేడ్‌కు చెందిన వంశీ(18)కి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం సమీపంలోని కేర్‌ఆస్పత్రికి తరలించారు.

సీటు బెల్ట్ పెట్టుకోకపోవడంతో..

పిల్లి అడ్డుగా రావడంతో సడన్ బ్రేక్ వేయగా.. కారు అదుపు తప్పిందని డ్రైవింగ్ చేసిన ఉదయ్ సాయి చెబుతున్నాడు. శ్రీరామ్ ఎగిరి కారు కింద పడ్డాడని, సీటు బెల్ట్ పెట్టుకుంటే పరిస్థితి మరోలా ఉండేదని పోలీసులు తెలిపారు. అతి వేగం, నిర్లక్ష్యంగా కారు నడపడంతోనే అదుపుతప్పినట్లు భావిస్తున్నారు. అవతలి వైపు రోడ్డులో కారు పల్టీ కొట్టినప్పుడు అటుగా వాహనదారులు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

కొడుకు ఇక లేదని..



బానోతు శ్రీరామ్ (ఫైల్)

డ్రైవర్ ఉదయ్ సాయికి డ్రైవింగ్ లైసెన్స్ లేదని శ్రీరామ్ కుటుంబ సభ్యులు చెబుతుండగా, లైసెన్స్ విషయంలో స్పష్టత రావాల్సి ఉందని పోలీసులు తెలిపారు. నాకు ఉంది 20 గుంటల భూమి, కూలి పనులు చేస్తూ రెక్కల కష్టంతో కూతురు హిమశ్రీ బీటెక్ చదివిస్తున్నానని, కొడుకు శ్రీరామ్‌ను పాలిటెక్నిక్ చదివిస్తున్నానని తండ్రి రామ్మోహన్ కన్నీరు మున్నీరు అయ్యారు. కొడుకు ఇక లేదని జీర్ణించుకోలేక గుండెలవిసేలా విలపించారు. ఘటనా స్థలాన్ని మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ మహేశ్, ఎస్ఐ విజయ్ కుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

హత్య కేసులో అన్న రిమాండ్

చిన్నశంకరంపేట(మెదక్):భూ వివాదంలో తమ్ముడిని హత్యచేసిన అన్నతోపాటు అల్లుడిని రిమాండ్‌కు తరలించినట్లు రామాయంపేట సీఐ లక్ష్మీబాబు తెలిపారు. పేట మండలం శాలిపేట ఉపసర్పంచ్ ఆంజనేయులుకు సోదరుడు సత్యనారాయణతో భూ వివాదం నెలకొంది. పెద్దల సమక్షంలో పంచాయితీ పెడితే తీర్పు నచ్చని సత్య నారాయణ తమ్ముడిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 20న అల్లుడు భానుప్రసాద్‌తో కలిసి ఆంజనేయులును హత్య చేశాడు. ఈ ఘటనపై శుక్రవారం ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తులు మృతి

కంది(సంగారెడ్డి): కందిలోని ఐఐటీ హైదరాబాద్ ఎదురుగా జాతీయ రహదారిని 28 ఏళ్ల వ్యక్తి దాటుతున్న క్రమంలో వేగంగా వచ్చిన వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదని రూరల్ ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు. మృతదేహాన్ని సంగారెడ్డిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

తూప్రాన్: తూప్రాన్ టోల్‌ప్లాజా సమీపంలో సుమారు 32 ఏళ్ల వ్యక్తి రహదారిపై తీవ్రగాయాలతో పడి ఉండగా 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి సంబంధించి ఎవరికైనా వివరాలు తెలిస్తే తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ శివానందం తెలిపారు.



గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలు

బీ అలర్ట్

మళ్లీ కోవిడ్ కలకలం

- వణికిస్తున్న కొత్త వేరియంట్ జేఎన్-1
- సిద్దిపేట ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాట్లు పూర్తి
- సిబ్బందిని అప్రమత్తం చేసిన వైద్యారోగ్యశాఖ
- మాస్క్‌లు ధరించాలంటున్న వైద్యులు





సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

సిద్దిపేటకమాన్: కోవిడ్ మహమ్మారి ముప్పు తప్పిందని భావిస్తున్న తరుణంలో మరోసారి తాజాగా కేసులు నమోదు అవుతుండడం కలకలం రేపుతోంది. ఇతర రాష్ట్రాల్లో కేసులు వెలుగులోకి చూస్తుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కరోనా ఒమిక్రాన్ జేఎన్-1 కొత్త వేరియంట్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో జిల్లా వైద్యారోగ్యశాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పత్రితోపాటు, గజ్వేల్, దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రులు, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కోవిడ్ టెస్టులు నిర్వహించేలా పారామెడికల్ సిబ్బంది, వైద్య సిబ్బందిని వైద్యారోగ్యశాఖ అధికారులు అప్రమత్తం చేశారు.

ఆర్టీపీసీఆర్ పరీక్షలు

సిద్దిపేట రూరల్ మండలంలోని ఓ వ్యక్తి షుగర్ లెవెల్స్ పరీక్షించుకోవడానికి ఐదు రోజుల క్రితం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. అతడికి సాధారణ పరీక్షల్లో భాగంగా వైద్య సిబ్బంది ఆర్టీపీసీఆర్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ రిపోర్టు వచ్చింది. దీంతో వైద్య సిబ్బంది ఆస్పత్రిలోని పాత భవనంలోని ప్రత్యేక వార్డులో రెండు రోజులపాటు చికిత్స అందించారు. తగ్గిన వెంటనే డిశ్చార్జ్ చేశారు. దీంతో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఫీవర్ కేసులను ప్రత్యేకంగా నమోదు చేస్తూ, వైద్యుల సూచనల మేరకు అవసరమైన వారికి ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేస్తున్నట్లు వైద్యాధికారులు తెలుపుతున్నారు.

వైద్యారోగ్యశాఖ అప్రమత్తం

సిద్దిపేట ప్రభుత్వాస్పత్రిలో కోవిడ్ చికిత్స కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బెడ్లు, మందులు, అవసరమైన సామగ్రి సిద్ధం చేశారు. చాలా నెలల తర్వాత కోవిడ్ ఐసోలేషన్ వార్డును ఏర్పా టు చేశారు. అవసరమైతే మరిన్ని బెడ్లు ఏర్పాటు చేస్తామని వైద్యాధికారులు తెలుపుతున్నారు. ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో గతంలో మెడికల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్లు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ క్రాంతికుమార్, పల్మనాలజిస్ట్ డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ చందర్‌తోపాటు ఇతర వైద్యులు, సిబ్బంది ఇంటికి, కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ ఎంతో కష్టపడి వైద్య సేవలు అందించి వేలాదిమంది ప్రాణాలు కాపాడారు. అదే విధంగా జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కాశీనాథ్ ప్రస్తుతం జిల్లాలోని పీహెచ్‌సీల్లో ఎంత మేరకు కోవిడ్ పరీక్షల కిట్లు ఉన్నాయి? ఎన్ని మాస్కులు, శానిటైజర్లు ఉన్నాయి అనే వివరాలను సేకరించారు.

కోవిడ్‌పై మాక్‌డ్రిల్.. నేడు జూమ్ మీటింగ్

జిల్లాలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కోవిడ్‌పై మాక్ డ్రిల్ నిర్వహించారు. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని కోవిడ్ ఐసోలేషన్ వార్డును పరిశీలించారు. ఆక్సిజన్ నిల్వలు, బెడ్లు, మందులు, పీపీ కిట్లు, మాస్కులు, శానిటైజర్లు, పల్స్ ఆక్సీమీటర్ల పనితీరు, కోవిడ్ టెస్టుల కిట్లు తదితర వాటిని వైద్యారోగ్యశాఖ అధికారులు తనిఖీ చేశారు. అలాగే గజ్వేల్, దుబ్బాక ప్రభుత్వాస్పత్రులు, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో శుక్రవారం కోవిడ్‌పై మాక్ డ్రిల్ నిర్వహించారు. కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడానికి, అందించాల్సిన వైద్య సేవలపై నేడు (శనివారం) మధ్యాహ్నం 11 గంటలకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్ అన్ని జిల్లాల డీఎంహెచ్ఓలతో జూమ్ మీటింగ్ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్ తెలిపారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



కోవిడ్ చికిత్స కోసం ఆస్పత్రిలో అన్ని ఏర్పాట్లు చేశాం. ఫీవర్ కేసులను ప్రత్యేకంగా నమోదు చేస్తున్నాం. ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి బెడ్లు సిద్ధం చేశాం. మందులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఎంత మంది వచ్చినా ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందిస్తాం. ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలి.

–డాక్టర్ కిషోర్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

జాగ్రత్తలు పాటించాలి



ప్రస్తుతం జిల్లాలో కేసులు లేనప్పటికీ ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి. భయపడాల్సిన పని లేదు. చిన్న పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, షుగర్, స్టిరాయిడ్స్ వినియోగించేవారు, కిడ్నీ, క్రానిక్ డిసీస్ ఉన్న వారు వైద్యులు సూచించిన జాగ్రత్తలు పాటించాలి. మాస్కులు ధరించి, శానిటైజర్ వాడుతూ, సోషల్ డిస్టెన్స్ మెయింటేయిన్ చేయాలి.

–డాక్టర్ క్రాంతికుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల